

## ఆధార్ అప్‌గ్రేడ్ పేరుతో అక్రమ వసూళ్లు..

ఆధార్ అప్‌గ్రేడ్ పేరుతో కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడిన ఘటన గూడూరు మండలంలో జరిగింది.

- 10లో▸



## ప్రాణం తీసిన స్నేక్ డ్రైవ్..

స్నేక్ డ్రైవ్.. ఓ వృద్ధుడి ప్రాణం తీసింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని యువకుడు స్నేక్ డ్రైవింగ్ చేస్తూ బైక్‌తో ఢీకొట్టాడు.

- 10లో▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
$28^0$ / $17^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### ఔషధ దుకాణాల్లో తనిఖీలు



ఎంజీఎం : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఔషధ దుకాణాల్లో నాలుగు రోజులుగా డ్రగ్ కంట్రోల్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించని 43 షాపుల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు డ్రగ్ ఏడీ రాజ్యలక్ష్మి తెలిపారు. హనుమకొండ, వరంగల్, జనగామ, భూపాలపల్లి, ములుగు పట్టణ ప్రాంతాల్లోని దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఔషధ నియంత్రణ సంచాలకులు కమలాహాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ (నిద్రమాత్రలు), షెడ్యూల్ హెచ్-1 మత్తు కలిగించే దగ్గు మందు టానిక్‌లు, వైద్యుల సిఫారసు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరాదని ఔషధ దుకాణ యజమానులను హెచ్చరించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించవద్దని, ప్రతిషాపులో సెల్ బిల్స్ ఇవ్వాలని ఆమె ఆదేశించారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ప్రతి నెలలో నాలుగు రోజులు నిరంతరాయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. తనిఖీల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, అరవింద్‌కుమార్, బాలకృష్ణ, పావని పాల్గొన్నారు.

### బాక్సింగ్ విజేతలకు అభినందన



హన్మకొండ: హైదరాబాద్, లాలాగూడలోని ఐవీ రావు బాక్సింగ్ అకాడమీలో ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ -17, 19 పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్ తెలిపారు. హెచ్.కార్తీక (గోల్డ్ మెడల్), హెచ్.స్ఫూర్తి, ఎస్.తనుశ్రీ, శివ, కార్తికేయ సిల్వర్ మెడల్ సాధించారని వివరించారు. ఈమేరకు క్రీడాకారులను గురువారం అభినందించినట్లు తెలిపారు. బాక్సింగ్ సంఘం కార్యదర్శి పెద్దమ్మ నర్సింహరాములు, పీఈటీల సంఘం ప్రెసిడెంట్ శీలం పార్థసారథి, పీఈటీలు సీహెచ్.రఘు, హెచ్.సుజాత ఉన్నారు.

### ఇందిరమ్మ రాజ్యమే ధ్యేయం



హసన్‌పర్తి: ఇందిరమ్మ రాజ్యమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. నియోజకవర్గంలోని హనుమకొండ మండలం పలివేల్పులలో ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ అరుణకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సంపత్, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, డివిజన్ అధ్యక్షులు ఐలేశ్వర్, సంగాల ప్రేమ్‌కుమార్, పొన్నాల రఘు, ఆకుల కుమార్, కమలాకర్, కందుకూరి పూర్ణచందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేయూ సమీపంలోని భీమారం ఎస్‌ఆర్‌ఎం జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.700 కోట్ల వరకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఏనాడూ విద్యారంగ సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సెమినార్‌లో ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు వికాస్, రాజ్‌కుమార్, శివ, సందీప్, అభిరామ్, రత్నాకర్ పాల్గొన్నారు.



ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్‌లో జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఐహెచ్‌సీ మాజీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కేశవన్ వెలుతాట్, ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ, మృదులా ముఖర్జీ, వీసీ తాటికొండ రమేశ్, సెషన్‌కు వస్తున్న ప్రతినిధులు





## దేశ భవిత చరిత్రకారులపైన..

- వాస్తవికతను తెలియజేయాల్సిన గురుతర బాధ్యత ఉంది
- నెహ్రూ మెమోరియల్ అండ్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్ మృదులా ముఖర్జీ
- కాకతీయ యూనివర్సిటీలో ఐహెచ్‌సీ సెషన్ ప్రారంభం

కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో మూడురోజులపాటు నిర్వహించే ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్(ఐహెచ్‌సీ) 82వ సెషన్ గురువారం ప్రారంభమైంది. ఈ సెషన్‌కు 1,063 పరిశోధనా పత్రాలు వచ్చాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి చరిత్రకారులు పరిశోధకులు, హిస్టరీ అధ్యాపకులు, యూనివర్సిటీల ఆచార్యులు 1,096 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు ప్రారంభ సమావేశంలో న్యూఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్, జేఎన్‌యూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు మృదులా ముఖర్జీ మాట్లాడారు. 'జవహర్‌లాల్ ఇన్ అవర్ పాస్ట్ ప్రజెంట్ ఫ్యూచర్' అనే అంశంపై ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ ప్రసంగించారు.

- కేయూ క్యాంపస్

- 10లో▸

# 4,149 దరఖాస్తులు

- మొదటి రోజు ప్రజాపాలనలో వచ్చిన అర్జీలు
- 35 జీపీలు, 8 మున్సిపల్ వార్డుల్లో సభలు

హన్మకొండ అర్బన్ : ప్రజాపాలన సభలకు మొదటి రోజు గురువారం ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ముందస్తు ఏర్పాట్లతో అధికారులు ప్రజలకు ఇబ్బందులు కాకుండా దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని 14 మండలాల్లో మొత్తం 43 ప్రజాపాలన సభలు ఏర్పాటు చేశారు. వాటిలో 35 గ్రామపంచాయతీలు, 8 మున్సిపల్ వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 9,103 కుటుంబాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు. మొదటి రోజు 4,149 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పలు దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికగుప్తా పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

**గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ..**



కమలాపూర్ : దరఖాస్తు స్వీకరిస్తున్న డీపీఓ జగదీశ్వర్

కమలాపూర్ : మండలంలోని లక్ష్మీపూర్, గూనిపర్తి, నేరెళ్ల, మాదన్నపేట గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. డీపీఓ జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై దరఖాస్తులను స్వీకరించారు. మొదటి రోజు నాలుగు గ్రామాల్లో మొత్తం 164 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ గుండె బాబు, తహసీల్దార్ పి.మాధవి, ఎంపీఓ విమల, వైద్యాధికారి రోహిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ పాల్గొన్నారు. అదేవిధంగా గూనిపర్తిలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాల సమస్యలు తెలుసుకున్నారు.

**పరకాలలో..**

పరకాల : మండలంలోని 10 గ్రామాలు, పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపాలిటీ పరిధిలో దరఖాస్తుల స్వీకరణను అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, పరకాల మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

**అధికారులపై ప్రశ్నల వర్షం..**

శాయంపేట : ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రజలు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. అప్పయ్యపల్లి, హుస్సేన్‌పల్లి, ఆరెపల్లి, నరసింహులపల్లి గ్రామాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్, టీం లీడర్లు తహసీల్దార్ సుభాషిణి, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏఓ గంగాజమున ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు. దరఖాస్తుల్లో కొత్త రేషన్‌కార్డుకు సంబంధించిన సమాచారం లేకపోవడంతో ఎలా దరఖాస్తు చేయాలని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. తెల్లకాగితంపై వివరాలు రాసి, ఆధార్ జిరాక్స్ జతచేసి పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని స్పెషల్ ఆఫీసర్ సూచించారు. తమకు రైతబంధు వస్తుందని.. మళ్లీ సర్వే నంబర్, బ్యాంకు ఖాతా నంబర్, పట్టాపాస్ పుస్తకం నంబర్ రాయాలా అని అడిగారు. దరఖాస్తుల్లో తప్పనిసరిగా రాయాలని అధికారులు పేర్కొన్నారు. జిరాక్స్ దరఖాస్తులు స్వీకరించమని, కలెక్టరేట్ నుంచి తెప్పించి దరఖాస్తులు అందజేస్తామని వారు తెలిపారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు ఒక దశలో తలలు పట్టుకున్నారు.



శాయంపేట : సందేహాలను నివృత్తి చేస్తున్న అధికారులు

**చింతలతాండలో ఘర్షణ**

వేలేరు : చింతలతండా గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ప్రొటోకాల్ లేని కాంగ్రెస్ నాయకులు ఇక్కడికి ఎందుకు వచ్చారని ఎంపీపీ ప్రశ్నించారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలు కాకపోతే గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను ప్రజలు తిరగనీయరని అన్నారు. పథకాలు 10 మందికి కూడా రావని అన్నారు. పథకాల గురించి కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరకే వెళ్లి అడగాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు తీసుకుంటుంటే కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులకు భయం పట్టుకుందని, ఆరు గ్యారంటీలు అమలు కావని ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు, జెడ్పీటీసీ చాడ సరిత, మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్ బాబు, టీం లీడర్లు తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, సర్పంచ్‌లు రాంచందర్, సంపత్, అధికారులు పాల్గొన్నారు.



వేలేరు : ఎంపీపీతో వాగ్వాదం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు**

| మండలం | దరఖాస్తులు |
|---|---|
| ఆత్మకూరు | 154 |
| భీమదేవరపల్లి | 539 |
| దామెర | 105 |
| ధర్మసాగర్ | 274 |
| ఎల్కతుర్తి | 95 |
| హనుమకొండ(గ్రేటర్) | 868 |
| హసన్‌పర్తి | 363 |
| ఐనవోలు | 275 |
| కమలాపూర్ | 164 |
| నడికూడ | 347 |
| పరకాల | 284 |
| పరకాల మున్సిపాలిటీ | 339 |
| శాయంపేట | 221 |
| వేలేరు | 121 |
| మొత్తం | 4,149 |



పరకాలలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

## ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి**

దామెర : ఎన్నికల ముందు తాము ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ అమలుకు కట్టుబడి ఉన్నామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. తక్కళ్లపహాడ్‌లో సర్పంచ్ బింగి రాజేందర్ అధ్యక్షతన ప్రజాపాలన గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజాపాలన నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఆర్డీఓ శ్రీనివాస్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంరెడ్డి, ఏసీపీ కిశోర్‌కుమార్, విద్యుత్ ఏడీఈ జె.దేవేందర్, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, మండల ప్రత్యేక అధికారి మాధవీలత, ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ శంకర్, ఎంపీటీసీ దుబాసి శ్రీలత, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పాలెపాక శ్రీనివాస్, మన్నెం ప్రకాశ్‌రెడ్డి, లంక సురేందర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

**ఎన్నికల ముందు ఇళ్లు మంజూరైతే ఎలా నిర్మించుకుంటారు?**

నియోజకవర్గంలో సుమారు 2000 మందికి గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఇళ్లకు బిల్లులు చెల్లించాలని వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్‌అలీ ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఎన్నికల ముందు ఇళ్లు మంజూరు చేస్తే లబ్ధిదారులు ఎలా నిర్మించుకుంటారని, చిత్తశుద్ధి ఉంటే సంవత్సరం ముందు ఎందుకు ఇళ్లు ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. రూ.ఐదు లక్షలు కావాలనుకునే లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, రూ.3 లక్షలు సరిపోతుందనుకునే వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

## అన్నదాతకు ప్రకృతి పరీక్ష

- సకాలంలో కురవని వర్షాలు..
- అకాల వర్షాలతో పంటలకు నష్టం
- సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం కరువు

2023 రివైండ్

హన్మకొండ : కూలీల కొరతతో వ్యవసాయంలో యాంత్రీకరణ తప్పనిసరైంది. గత ప్రభుత్వం నాలుగేళ్లుగా యాంత్రీకరణ సాయం నిలిపేసింది. రాయితీపై యంత్రాలు, వివిధ రకాల పనిముట్ల అందించే వ్యవసాయ శాఖ కేవలం రైతుబంధుకే పరిమితమైంది. ఈ ప్రభుత్వమైనా యాంత్రీకరణకు సాయం అందిస్తుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**రైతులకు అందని ఏప్రిల్ నెల పంట నష్టపరిహారం..**

ప్రకృతి అన్నదాతతో ఈ ఏడాదంతా ఆడుకుంది. ఈ సంవత్సరం జూన్ నుంచి ఆగస్టు వరకు సరైన వర్షాలు కురవలేదు. ప్రభుత్వం సాగును నెల రోజులు ముందుకు జరపాలని ఆలోచిస్తే ప్రకృతి అందుకు భిన్నమైన పరిస్థితులు కల్పించింది. దీంతో సాగు మరింత వెనక్కి వెళ్లింది. వానా కాలంలో హనుమకొండ జిల్లాలో పంటలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. 2023 మార్చిలో కురిసిన వడగళ్లకు జిల్లాలో 7,340 మంది రైతులకు చెందిన 6,209.01 ఎకరాలు, ఏప్రిల్‌లో కురిసిన వడగళ్లకు 12,163 మంది రైతులకు చెందిన 9,745.29 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని చెప్పి ఆ మొత్తాన్ని మంజూరు చేసింది. ఇందులో మార్చి నెల పరిహారం రైతులకు పంపిణీ చేసింది. ఏప్రిల్ పంట నష్టపరిహారం మంజూరైనా పంపిణీ చేయలేదు.

**గత యాసంగిలో 1,78,801 ఎకరాల్లో పంటలు..**

జిల్లాలో గత యాసంగిలో అన్ని పంటలు కలిపి సాధారణ సాగు 1,34,400 ఎకరాలు కాగా, 1,78,801 ఎకరాల్లో సాగయ్యాయి. ఇందులో వరి సాగు 81,104 కాగా.. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో అత్యధికంగా 1,32,680 ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న సాగు 49,550 ఎకరాలు కాగా 45,220 ఎకరాల్లో సాగైంది. శనగ 941 ఎకరాలు కాగా 67 ఎకరాల్లో సాగైంది. వేరుశనగ 1863 ఎకరాలకు 368 ఎకరాల్లో సాగైంది. ఇతర పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగయ్యాయి. ప్రకృతి సహకరించక పోవడం, ప్రతికూల పరిస్థితులతో సాధారణంతో చూస్తే సాగు విస్తీర్ణం తగ్గింది. సాధారణ సాగు విస్తీర్ణం 2,38,294 ఎకరాలు కాగా 2,32,764 ఎకరాల్లో మాత్రమే సాగైంది. వరి మినహా మిగతా పంటలు సాధారణం కంటే తక్కువ విస్తీర్ణలో సాగయ్యాయి. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,12,396 ఎకరాలు కాగా 1,46,020 ఎకరాల్లో సాగైంది. ప్రతిసారి పెరిగే పత్తి సాగు విస్తీర్ణం తగ్గడం విశేషం. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 1,08,944 ఎకరాలు కాగా 82,155 ఎకరాల్లో మాత్రమే సాగైంది. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 12,745 ఎకరాలు కాగా 5,226 ఎకరాల్లో మాత్రమే సాగైంది. కంది సాధారణ విస్తీర్ణం 2,390 ఎకరాలు కాగా 539 ఎకరాల్లో సాగైంది. సోయాబీన్ సాధారణ సాగు 147 ఎకరాలు కాగా 235 ఎకరాల్లో సాగైంది. వేరుశనగ సాధారణ సాగు 213 ఎకరాలు కాగా 27 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇతర పంటలు కూడా తక్కువగానే సాగయ్యాయి.

**1,07,450 మంది రైతులకు అందని రైతుబంధు..**

గత యాసంగిలో వరి సాగు విస్తీర్ణం పెరగడంతో ధాన్యం దిగుబడి పెరిగింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడం, ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత, ధాన్యం తరలింపునకు రవాణా వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే, ఈ వానా కాలంలో రైతులు ధాన్యం కొనుగులు కేంద్రాలతోపాటు నేరుగా మిల్లర్లకు సులువుగా అమ్ముకుంటున్నారు. ప్రస్తుత యాసంగిలో 1,53,064 మంది రైతులకు రూ.136,09,75,027 రైతుబంధు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 45,614 మందికి రూ.10,68,66,403 చెల్లించారు. ఇంకా 1,07,450 మంది రైతులకు రూ.125,41,08,624 చెల్లించాల్సి ఉంది. గత యాసంగిలో 1,48,945 మంది రైతులకు 136,09,64,860 చెల్లించారు. వానా కాలంలో 1,50,982 మంది రైతులకు రూ.136,08,18,594 అందించారు.

**956 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు..**

2022-2023 సంవత్సరంలో 301 మంది రైతులు 1139 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారు. 2023-2024లో 5,800 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటి వరకు 796 మంది రైతులు 2,769 ఎకరాల్లో సాగు చేసేందుకు ముందుకు వచ్చారు. 363 మంది రైతులు 1,209 ఎకరాల్లో సాగు చేసుకునేందుకు అనుమతి లభించింది. ఇప్పటి వరకు 289 మంది రైతులు 956 ఎకరాల్లో సాగు చేశారు. జూన్, జూలైలో వర్షాలు కురవక సాగు ఆలస్యమైంది. దీంతో సాగు విస్తీర్ణం తగ్గింది. వరి మినహా మిగతా పంటలు తక్కువగా సాగయ్యాయి. భూగర్భ జలాలు అందుబాటులో ఉండడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముంది. హనుమకొండ జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు లేవు. ధర్మసాగర్ జలాశయాన్ని వరంగల్ నగర తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు.

## కేంద్రం విధానాలను వ్యతిరేకించాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి**

ఐనవోలు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. ముల్కలగూడెంలో సర్పంచ్ బండి పర్వతాలు అధ్యక్షతన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చక్రపాణి హాజరై మాట్లాడారు. లోక్‌సభ నుంచి 146 మంది సభ్యులను సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. దేశ రక్షణను ప్రధాని మోదీ గాలికి వదిలేశారని ఆరోపించారు. పార్లమెంట్‌పై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పైన జరిగిన దాడిగానే పరిగణించాలన్నారు. పార్లమెంట్‌ను రక్షించుకోలేని మోదీ దేశాన్ని ఏ రకంగా కాపాడుతారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు బీజేపీ దేశ సరిహద్దుల్లో ఏదో ఒక సంఘటన సృష్టించి, ప్రజల్లో భావోద్వేగాన్ని రగిలించి అధికారంలోకి రావడం తప్ప ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం కాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సీపీఎం, వామపక్షాలు, లౌకిక శక్తులు చేస్తున్న పోరాటంలో దేశభక్తులు, ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయ వాదులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్‌ను అభినందించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య, గుండెకారి మహేందర్, నారాయణరెడ్డి, రాంకుమార్, మోహన్‌రావు, ఉప్పలయ్య, గుండెకారి బాబురావు, గోపాల్‌రావు, చంద్రయ్య, మహేందర్, విజయ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న బొట్ల చక్రపాణి

## రైల్వే ఉద్యోగులకు పురస్కారాల ప్రదానం



కాజీపేట రూరల్ : విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన 10 మంది రైల్వే ఉద్యోగులకు ప్రతిష్టాత్మకమైన రైల్వే పురస్కార్ -2023 అందించారు. సికింద్రాబాద్ రైల్ కళారంగ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్ చేతుల మీదుగా కాజీపేట రైల్వే లోకోపైలెట్లు పాక రాజ్‌కుమార్, రాంసింగ్, నయావతార్ మీనా, బోడ రాజుతోపాటు పలువురు ఉద్యోగులు అవార్డులు, ప్రశంసపత్రాలు అందుకున్నారు.

## క్లుప్తంగా

### అధ్యాపకులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

**హసన్‌పర్తి :** నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో రెండు రోజులు నిర్వహించనున్న అధ్యాపకుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. 'గిట్ హబ్ కోడ్ స్పేస్' అనే అంశంపై ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఐటీ రంగ శిక్షకురాలు జిజ్ఞాస దలాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిట్ హబ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎస్సార్ యూనివర్సిటీ సీఎస్సీ విభాగాధిపతి డాక్టర్ శశికళ మాట్లాడుతూ ఈ సదస్సు అధ్యాపకులకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ సురేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నీలిమ పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

**లింగాలఘణపురం:** మండలంలోని కుందారం గ్రామానికి చెందిన సజ్జన నర్సయ్య (40) తన వ్యవసాయ బావి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సయ్య హైదరాబాద్‌లో కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని చెప్పి అక్కడే చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. పోలీసులు మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

### ఆధార్ అప్‌గ్రేడ్ పేరుతో అక్రమ వసూళ్లు..

**గూడూరు:** ఆధార్ అప్‌గ్రేడ్ పేరుతో కొందరు వ్యక్తులు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం మండల కేంద్రం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని చెంద్రుగూడెంలో ఓ ఇంటికి మరో మండలానికి చెందిన వ్యక్తులు కంప్యూటర్, జిరాక్స్ మిషన్‌తో పాటు చేరుకున్నారు. తాము ఆధార్ అప్‌గ్రేడ్ వెంటనే చేస్తామని, అందుకు రూ. 200 అవుతుందని తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తులకు ఆధార్ తప్పిదాలు ఉంటే సరి చేసుకునేందుకు మీ సేవా కేంద్రాల్లో ఆలస్యం అవుతుందని, తాము వెంటనే చేయిస్తామని చెప్పి కొందరి ఆధార్‌తో పాటు డబ్బులు తీసుకుని అప్‌గ్రేడ్ చేయడం ప్రారంభించారు. ఈ విషయం ఓ వ్యక్తి తహసీల్ కార్యాలయ గ్రూప్‌లో పోస్టు చేశారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న అప్‌గ్రేడ్ చేస్తున్న వ్యక్తులు వెంటనే ఆ ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రం తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆ అప్‌గ్రేడ్ చేసిన వారి వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సదరు వ్యక్తులు సాయంత్రం వరకు 50 మంది ఆధార్ కార్డులు అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రచారం. తహసీల్ కార్యాలయానికి సమాచారం లేకుండా ఆధార్ అప్‌గ్రేడ్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన వారు నెక్కొండ మండలానికి చెందిన వారని తెలిసింది.






స్టాల్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రతినిధులు



ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌కు వస్తున్న ప్రతినిధులు





కేయూ ఆడిటోరియంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు




# దేశ భవిత చరిత్రకారులపైన..

- వాస్తవికతను తెలియజేయాల్సిన గురుతర బాధ్యత ఉంది
- మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్ మృదులాముఖర్జీ
- కేయూలో ఐహెచ్‌సీ సెషన్ ప్రారంభం




వేదికపై ఆసీనులైన అతిథులు

**కేయూ క్యాంపస్:** దేశంలో చరిత్ర వక్రీకరణలు జరుగుతున్నాయని, వీటికి వ్యతిరేకంగా వాస్తవిక చరిత్రను తెలియజేయాల్సిన గురుతర బాధ్యత చరిత్రకారులపై ఉందని, ఈ దేశ భవిత చరిత్రకారులపై ఆధారపడి ఉందని న్యూఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్, జేఎన్‌యూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ మృదులా ముఖర్జీ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని ఆడిటోరియంలో మూడు రోజులు నిర్వహించే ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్ గురువారం ప్రారంభమైంది. ఈ సెషన్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా లౌకిక, సోషలిస్టు, ప్రజాస్వామిక, మౌలిక భావనల పవిత్రను కాపాడాల్సిన బాధ్యత చరిత్రకారుల భుజస్కందాలపై ఉందన్నారు. లౌకిక, శాస్త్రీయ దృక్పథంతోనే ఐహెచ్‌సీ ముందుకెళ్తుందన్నారు. భారత జాతీయ ఉద్యమంపై పరిశోధన సందర్భంగా తాను బిపిన్ చంద్ర, తదితరులతో కలిసి 1984లో తెలంగాణ ప్రాంతంలో పర్యటించామన్నారు. అప్పటి సాయుధ పోరాట యోధులైన పలువురిని రావినారాయణరెడ్డిలాంటి వారితో కలిసి ఇంటర్వ్యూలు కూ డా చేసినట్లు తెలిపారు. చరిత్రకారులు పక్షపాతంలేకుండా వాస్తవిక చరిత్రను వెలుగులోకి తీసుకురావాలన్నారు. దేశంలోని వివి ద పరిస్థితులు చూస్తుంటే రాబోయే కాలంలో చరి త్రకారులకు మరింత ఇబ్బందులు కలిగించే పరిస్థితులు చవిచూడాల్సి వస్తుందన్నారు. అలాంటి ఇబ్బందులు ఎదుర్కొని వాస్తవిక చరిత్రను రాయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఓరుగల్లు.. కాకతీయుల చరిత్ర కలిగిన ప్రాంతమన్నారు. ఈ ప్రాంతంలో చారిత్రక పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నాయని, వాటి చరిత్రను కూడా యువచరిత్రపరిశోధకులు తెలుసుకోవాలని ఆమె సూచించారు.

**పలువురికి బహుమతులు, అవార్డుల అందజేత**

2022 సంవత్సరంలో మద్రాస్‌లోని క్రిస్టియన్ కాలేజీలో జరిగిన చివరి సమావేశంలో పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి ఈ సమావేశంలో అవార్డులు, బహుమతులు అందజేశారు. ప్రొఫెసర్ రామచంద్రగుహ జీవిత కాల సాఫల్య పురస్కారం కూడా ప్రకటించారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన దివంగత ప్రసన్న కుమార్‌బిస్వాల్ జ్ఞాపకంగా ఆయన సతీమణి భారత చరిత్ర కాంగ్రెస్ పేరున రూ. లక్ష విరాళం అందించారు.వేదిక కార్యదర్శి ఎస్‌కే ఎస్ ఏ నదీమ్‌రిజావికి అందజేశారు. కార్యక్రమానికి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి హరగోపాల్, కేయూ మాజీ వీసీ వి గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ మురళీమనోహర్, హిస్టరీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనాథ్, ప్రముఖ చరిత్రకారులు హాజరయ్యారు.

**నెహ్రూ విధానాలపై మతతత్వశక్తుల దాడి**

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ భావజాలం, విధానాలపై నేడు మతతత్వశక్తులు పెద్ద ఎత్తున దాడులు చేస్తున్నాయని ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్యముఖర్జీ అన్నారు. ఐహెచ్‌సీ ప్రారంభ సమావేశంలో జనరల్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం 'జవహర్‌లాల్ ఇన్ అవర్ పాస్ట్ ప్రజెంట్ ఫ్యూచర్'అనే అంశంపై ప్రసంగించారు. భారత దేశం నేడు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు జవహర్‌లాల్ నెహ్రూ కారణమనే విధంగా మతతత్వశక్తులు ప్రచారం చేస్తున్నారన్నారు. దేశ విభజన, భారత్– చైనా, కాశ్మీర్ సమస్యల వివాదానికి కూడా నెహ్రూ కారణమనే విధంగా మతతత్వశక్తులు ఆయన విధానాలపై దాడులు చేస్తున్నాయన్నారు. విద్యారంగం వెనుకబడడానికి కూడా నెహ్రూనే కారణమనే విధంగా అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. నెహ్రూ జ్ఞాపకాలను చెరిపే యత్నం చేస్తుండడం చూస్తున్నామన్నారు. ఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ అండ్ మ్యూజియం పేరులో నెహ్రూ పేరును తొలగించి ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియంగా మార్చారని గుర్తుచేశారు. 75 సంవత్సరాల భారత దేశ స్వాతంత్య్ర పోరాట పోస్టర్‌లో నెహ్రూ ఫొటోను కూడా లేకుండా చేశారన్నారు. వి.డి సావర్కర్ ఫొటోపెట్టారన్నారు. నాడు నెహ్రూ మైనార్టీ, మెజార్టీ మతతత్వాలను వ్యతిరేకించారన్నారు. రెండు మతాలు కూడా ఒకదానికొకటి పోషించుకుంటాయని, ఒకరినొకరు విమర్శించుకుంటూ పార్లమెంట్, అసెంబ్లీలో ప్రజావ్యతిరేక చట్టాలను రూపొందించుకోవడంలో సహకరించుకుంటాయని విమర్శించారు. దేశం నేడు సాధించిన శాస్త్ర, సాంకేతిక రంగాల ప్రగతి నాడు నెహ్రూ అనుసరించిన వి ధానాలతోనే అన్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, సీఎస్ఐఆర్ అటామిక్ ఎనర్జీ కమిషన్, డీఆర్‌డీవో, నేషనల్ ఫిజికల్ లేబరేటరీ, నేషనల్ కెమిస్ట్రీ లేబరేటరీ లాంటి అనేక పరిశోధన సంస్థలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు.



సెమినార్‌కు హాజరైన ప్రతినిధులు

**శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాలి**

శాస్త్రీయ దృక్పథంతో చరిత్రను అధ్యయనం చేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. చరిత్రను వర్తమానం నుంచి భవిష్యత్ తరాలకు అందించే గురుతర బాధ్యతను చరిత్రకారులే నిర్వర్తిస్తున్నారన్నారు. దేశ సంస్కృతి, అభివృద్ధిలో చరిత్ర పాత్ర గణనీయమైందన్నారు. తెలంగాణ ఎంతో గొప్ప చరిత్ర కలిగి ఉందన్నారు. కాకతీయుల కాలం నాడు సమక్క,సారలక్క పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ లాంటివాళ్లను గుర్తుచేశారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సదస్సులకు ఎల్లప్పుడు కాకతీయ యూనివర్సిటీ ముందువరుసలో ఉంటుందన్నారు. మూడురోజులు జరిగే ఈ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో దేశానికి ఉన్నత సందేశం అందించాలని కోరారు. సమావేశంలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెక్రటరీ సయ్యద్ అలీనదీమ్ రిజావి, ఐహెచ్‌సీ లోకల్ సెక్రటరీ టి మనోహర్. ఐహెచ్‌సీ మాజీ జనరల్ ప్రెసిడెంట్లు ప్రొఫెసర్ కేశవన్ వెలుతాట్ (కేరళ) కెఎం శ్రీమాలి మాట్లాడారు. వేదిక మీద ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ కార్యవర్గం( ఎగ్జిక్యూటివ్ బాడీ)బాధ్యులు ఉన్నారు. ఈనెల 29, 30న కూడా కొనసాగనుంది.

**కేయూ ఆడిటోరియం వద్ద ప్రతినిధుల సందడి**

కేయూలో గురువారం ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ ప్రారంభమైంది. మూడురోజులు జరిగే ఈ సెషన్‌కు 1063 పరిశోధన పత్రాలు వచ్చాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి చరిత్రకారులు, పరిశోధకులు, హిస్టరీ అధ్యాపకులు, యూనివర్సిటీల ఆచార్యులు 1096 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో కొందరు ఆన్‌లైన్‌లో చేసుకోగా మరికొందరు నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరికి నగరంలో వివిధచోట్ల వసతి కల్పించారు. కొందరికి యూనివర్సిటీలోనే హాస్టళ్లలో వసతి కల్పించారు. ఆడిటోరియంలో జరిగిన ఐహెచ్‌సీకి వచ్చిన వారితో సందడి నెలకొంది. ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

**బుక్ ఫెయిర్**

కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం వద్ద వివిధ ప్రచురణ సంస్థలు బుక్ ఫెయిర్ నిర్వహించాయి. వివిధ చారిత్రక పుస్తకాలు కూడా అందుబాటులో ఉంచారు.వీటివద్ద కూడా సందడి కనిపించింది.




ఐహెచ్‌సీ సెషన్‌లో మాట్లాడుతున్న కేయూ వీసీ రమేశ్, ఐహెచ్‌సీ సెక్రటరీ సయ్యద్ అలీనదీమ్‌రిజావి, కేశవన్ వెలుతాటి, కేఎం శ్రీమాలి, ముఖ్యఅతిథి మృదులా ముఖర్జీ, ఇండియన్ హిస్టరీ ప్రెసిడెంట్ ఆదిత్య ముఖర్జీ

**ఐహెచ్‌సీలో విదేశీ ప్రతినిధులు..**

కాకతీయ యూనివర్సిటీలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82 సెషన్‌కు ఇద్దరు విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో మహమ్మద్ ఆహ్మద్ (ఉబ్జెకిస్తాన్), రీతు కందూరి( అమెరికా సంయుక్త రాష్ట్రాలనుంచి )హాజరయినట్లు లోకల్ సెక్రటరీ టి మనోహర్ తెలిపారు.

**ప్రొసీడింగ్స్ సంపుటి ఆవిష్కరణ**

ప్రముఖ చరిత్ర కారుడు రామచందర్ గుహకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించారు. 81వ సెషన్‌లో జరిగిన ప్రొసీడింగ్స్ (పరిశోధన పత్రాల ) సంపుటిని( పుస్తకం)ఆవిష్కరించారు. ఆ సెషన్‌లో పత్రాలు సమర్పించిన వారికి ఏడుగురికి ఉత్తమ పుస్తకాలకు, 10మందికి ఉత్తమ పత్రాలకు అవార్డులు ,నగదు బహుమతులు అందజేశారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో యాన్సింట్ ఇండియా, మోడర్న్ ఇండియా, ఆర్కియాలజీ, కాంటెంపరరీ ఇండియా అనే అంశాలపై పరిశోధన పత్రాల సమర్పించారు.



ప్రతినిధులకు అవార్డులు ప్రదానం చేస్తున్న అతిథులు








## సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

**PLOT FOR SALE**

■ జనగాంకి దగ్గరలో Farm Land చ॥గ॥ 2100/- DTCP చ॥గ॥ 3600/- లాంచింగ్ ఆఫర్‌తో గలవు. భూమి విలువ తెలిసినవారు త్వరపడి తక్కువ ధరకే Plot కొని ఆనందించగలరు. Ph: 7416591078 [H-801455]

**వ్యవసాయ భూమి అమ్మకం**

■ అదాలత్ సెంటర్ నుండి 9 కి.మీ. దూరంలో అమ్మవారిపేటలో 44 గుంటల వ్యవసాయ భూమి క్లియర్ టైటిల్, రైతు బంధు గలది. బోరు, కరెంట్, చుట్టు ఫెన్సింగ్ గలది అమ్మకం. 9948279266. [W-1229347]

**SERVICES**

**FINANCE**

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL 9618767116. [W-788976]

**WANTED**

■ శ్రీబాలాజీ సోలార్ ఎనర్జీస్‌లో డోర్ to డోర్ మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు కావలెను. జీతం: 10-15K+TA+ ఇన్సెంటీవ్స్ # లష్కర్‌బజార్, HNK. 9160280900, 9515954923. [W-1229499]

■ Wanted Experienced Lab Technician, Pharmacist, PRO & Supervisor to work at Sri Sri Cardiac Center, Hanumakonda. Cont: 9966653521, 8639082085. [WA-7263]

■ సుబేదారి నందు గల గర్ల్స్ హాస్టల్ ఫర్నీచర్‌తో అమ్మబడును. హాస్టల్‌లో ఉండి వంట చేయుటకు వంట మనిషి కావలెను. (లేడీస్) సంప్ర॥ 8328620934. [W-1229387]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మెసేజీలు పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167569]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ. 18 K. ఫోన్: 9640258899 / 9640468899. [H-793668]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-8407]

■ భువనగిరి ఏరియాలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం : 12,000/- రూం వసతి ఫ్రీ, 12 గంటల డ్యూటీ. సంప్ర॥ 6304719869. [Y-784280]

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి**

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


# ప్రాణం తీసిన స్నేక్ డ్రైవ్ ..

- వృద్ధుడిని ఢీకొన్న బైక్.. తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

**ఖిలా వరంగల్ :** స్నేక్ డ్రైవ్.. ఓ వృద్ధుడి ప్రాణం తీసింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఓ యువకుడు స్నేక్ డ్రైవింగ్(మెలికలు తిరుగుతూ) చేస్తూ బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన వృద్ధుడిని పోలీసులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుంగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈఘటన వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్ సమీపంలో జరిగింది. మిల్స్‌కాలనీ ఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట గ్రామానికి చెందిన సముద్రాల వీరమల్లు(70) వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న సన్ షైన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం హోటల్‌లో భోజనం చేసేందుకు హనుమకొండ వైపు నుంచి ఆర్టీఏ జంక్షన్‌కు నడుచుకుంటూ వస్తున్నాడు. ఈక్రమంలో హనుమకొండ నుంచి బైక్‌పై అతివేగం, స్నేక్ డ్రైవ్‌తో ఆర్టీఏ జంక్షన్ వైపునకు వెళ్తున్న వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన దినేష్.. వీరమల్లును వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో వీరమల్లుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ ఎస్సై వెంకన్న హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి క్షతగాత్రుడిని 108లో ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈఘటనపై మృతుడి కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న ఎస్సై వెంకన్న

# పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.65 లక్షల మేర నష్టం
- జాకారం సమీపంలో ఘటన

**ములుగు రూరల్ :** ములుగు మండలం జాకారం సమీపంలో ఉన్న రాజరాజేశ్వర కాటన్ ఇండస్ట్రీలో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.65 లక్షల మేర నష్టం వాటినట్లు సీసీఐ అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీసీఐ ద్వారా నెల రోజుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని రాజరాజేశ్వర మిల్లులో నిల్వ చేశారు. మిల్లు నడుస్తున్న క్రమంలో ఏయిర్ కంప్రెషర్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు అంటుకున్నాయి. దీంతో లోపలి నుంచి మంటలు వ్యాప్తి చెంది బయట షెడ్డులో నిల్వ చేసిన పత్తికి అంటుకున్నాయి. దీంతో పొగ రావడంతో కూలీలు గమనించి కేకలు వేశారు. యాజమాన్యం అప్రమత్తమై ఫైర్ సెఫ్టీ సిలిండర్లతో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు. అనంతరం అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో ములుగు, పరకాల, నర్సంపేటకు చెందిన అగ్ని మాపక సిబ్బంది వచ్చి సహాయక చర్యలు చేపట్టాయి.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**సుమారు రూ. 65 లక్షల మేర నష్టం..**

రాజరాజేశ్వర కాటన్ ఇండస్ట్రీలో రూ. 2కోట్ల విలువైన పత్తి నిల్వ ఉన్నట్లు సీసీఐ అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన ఘటనలో సుమారు రూ. 65 లక్షల విలువైన పత్తి అగ్నికి ఆహుతైందని తెలిపారు. దీంతో మిల్లు యజమాని నల్లెల్ల రవికి భారీ నష్టం వాటిల్లింది. కాగా, సమయానికి ఫైర్ సెఫ్టీ, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రూ. కోటీ 40 లక్షల విలువైన పత్తిని కాపాడారు.

# రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బుధ, గురువారాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

–సాక్షి నెట్‌వర్క్

**మహాముత్తారం:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని బోర్లగూడంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ముక్‌లోత్ సమ్మయ్యనాయక్(55) బైక్‌పై మండలంలోని పెగడపల్లి గ్రామానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ బోర్లగూడెం గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో సమ్మయ్య నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.



సమ్మయ్య నాయక్ (ఫైల్)

**ఏటూరునాగారంలో యువకుడు..**

**ఏటూరునాగారం :** ములుగు జిల్లా మల్లంపల్లి సమీపంలోని 163 జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొన్న ఘటనలో గాయపడిన ఏటూరునాగారానికి చెందిన మల్యాల అనిల్‌కుమార్(27) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏటూరునాగారం మండలంలోని రొయ్యూర్‌కు చెందిన కరీం, మండల కేంద్రానికి చెందిన మల్యాల అనిల్‌కుమార్ పని నిమిత్తం బుధవారం వరంగల్ వెళ్లారు. పనులు ముగించుకుని ఏటూరునాగారం వస్తుండగా మల్లంపల్లి వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో అనిల్‌కు తీవ్రగాయాలు కాగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, నాగయ్య, సమ్మక్క దంపతుల పెద్ద కుమారుడు అనిల్ ఆధార్ సెంటర్ నడుపుకుంటూ కుటుంబానికి ఆసరా అవుతున్నారు.



అనిల్(ఫైల్)

**విశ్వనాథపురంలో మరో యువకుడు..**

**స్టేషన్‌ఘన్‌పూర్:** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని శివునిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుర్రపు నర్సింగరావు(33) పని నిమిత్తం బైక్‌పై ఘన్‌పూర్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తుండగా శివునిపల్లిలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ఘటనలో నర్సింగరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతుడి కుటుంబీకులు సమాచారం అందించగా ఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు బాబురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సట్ల రాజు గురువారం తెలిపారు. కాగా, నర్సంగరావు మృతిపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీటీసీ మారపాక రవి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, ఘన్‌పూర్ సర్పంచ్ సురేష్‌కుమార్, గుర్రం యేసుబాబుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.



నర్సింగరావు (ఫైల్)